ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | అక్టోబరు 02, 2026 | సంపుటి : 7 | సంచిక : 104 | పేజీలు : 2



## సర్ పొడిగింపు ఇక ఉండదు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని, 54 లక్షల మందిని తుది జాబితాలోకి తీసుకున్నామని వెల్లడించారు. "ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80వేల మందికి నోటీసులు ఇచ్చాం. నోటీసులు అందుకున్న వారిలో 20శాతం మంది సమాధానాలు ఇచ్చారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకే బీఎల్‌వోలు వెళ్లి సంబంధిత పత్రాలు తీసుకుంటారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన పనిలేదు.. ఒక్కరే మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుంది. సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదు" అని సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం
- సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కెఆర్.నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, తదితరులు



# అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి









**హనుమకొండ, ఆయుధం:** అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అధికారులు అమలు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, మేన శ్రీను, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, వైద్య ఆరోగ్య, విద్య, మహిళా శిశు సంక్షేమం, రహదారులు, తదితర శాఖల అధికారులతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరు, వాటి పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై ఎంపీ, ఎమ్మెల్యేలు సమీక్ష చేశారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీ ఫండ్స్ ద్వారా చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసే విధంగా పర్యవేక్షణ చేసి అందుకు సంబంధించిన చెల్లింపులు కూడా వేగవంతంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన నాణ్యమైన వైద్య సేవలను అందించాలని పేర్కొన్నారు. గర్భిణీల వివరాలను వంద శాతం నమోదు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గర్భిణీల వివరాలు నమోదు చేయడంలో అలసత్వం ప్రదర్శించవద్దని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డయాబెటిస్ ఉన్నవారికి ఇన్సులిన్ అందుబాటులో ఉందా లేదా అనేది పరిశీలించాలని డిఎంహెచ్వోను ఆదేశించారు. ఓపి విధానంలో కొనసాగుతున్న క్యాన్సర్ వైద్య సేవలు మరింత మెరుగు కావాలన్నారు. వ్యాక్సిన్ కార్యక్రమాలను వైద్యారోగ్య శాఖ సిబ్బంది పటిష్టంగా అమలు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో వంద శాతం అమలు జరగాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా బాలల పరిరక్షణకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళా శిశు సంక్షేమ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో బాల్యవివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్ రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అధికారుల పనితీరుతోనే సమాజంలో అభివృద్ధి, మార్పు కనిపిస్తుందన్నారు. దిశా కమిటీ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, కేంద్ర పథకాల అమలు పురోగతి ఏ విధంగా జరుగుతున్నాయో సంబంధిత వివరాలను తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందన్నారు.

స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలే మేలు అని, ఈ విషయాన్ని మరింతగా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. వేరే ప్రాంతాల నుండి కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులను తెప్పించుకునే పరిస్థితులు పోవాలన్నారు. వరి, పత్తి, ఇతర పంటల కంటే కూరగాయల సాగుతో అధిక లాభాలు ఉన్నాయన్నారు. ధర్మసాగర్ సర్వీస్ రోడ్డు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ధర్మసాగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిస్థితులు మెరుగుపడాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని డిఇఓ కు సూచించారు. విద్యార్థులకు మాథ్స్ ఇంగ్లీషులో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే వారి కెరీర్ కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విబి జీ రామ్ జి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్, గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాల భవనాలు నిర్మించవచ్చని, అందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. దిశా కమిటీ సమావేశం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని, కమిటీ చైర్మన్ అయిన ఎంపి కి ప్రభుత్వ పథకాల అమలు అధికారుల పనితీరు గురించి నేరుగా స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఉంటుందన్నారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులు ఉన్న దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు సాగు పై వ్యవసాయ ఉద్యాన శాఖల అధికారులు తగిన కార్యచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. హసన్‌పర్తి, ఓఆర్ఆర్ దేవన్నపేట, టేకులగూడెం, వంగ పహాడ్, తదితర ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, మడికొండ వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ కనెక్షన్ సదుపాయం ఉండాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు, ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు.

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విడతల వారీగా అంగన్వాడీ కేంద్రాలు, వివో భవనాల నిర్మాణాలను చేపడతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరిరాజు గౌడ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాటం

**జాతీయం, ఆయుధం;** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. అక్టోబర్ 2 నుంచి ఈ నిరసనలు ప్రారంభంకానున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. సీఈసీ నియామకంలో పారదర్శకత ఉండాలని.. పౌర సమాజానికి భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ముంబయిలోని శివాజీ పార్క్‌లో అక్టోబర్ 2న సాయంత్రం 'జైల్ భరో ఆందోళన్' చేపట్టాలని సీజేపీ నిర్ణయించింది. అయితే ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అక్కడ సభల నిర్వహణకు అనుమతి లేదని తెలిపారు. ప్రత్యామ్నాయ వేదికను ఎంచుకోవాలని సూచించారు. పోలీసులే కాకుండా.. శివాజీ పార్క్ పరిసరాల్లోని నివాసితులు కూడా ఈ నిరసనను తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలుస్తోంది.



## టీబీ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో వైద్య ఆరోగ్యశాఖ హనుమకొండ వారి అధ్వర్యంలో గురువారం టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య , వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తమ చేతుల మీదుగా టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు, వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు దోహదపడుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. టీబీ నిర్మూలన లక్ష్య సాధనలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, వైద్య సంఘాలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ ప్రదీప్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి: చల్లా

**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో పరకాల నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ శ్రేణులతో విస్తృతంగా చర్చించిన చల్లా.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టభద్రులు, యువత, ఉద్యోగుల కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పట్టభద్రులకు వివరించి బీఆర్ఎస్ వైపు మద్దతు కూడగట్టాలని అన్నారు. పట్టభద్ర ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఓటరును నేరుగా కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కోరాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామం, పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలాన్ని నిరూపించేలా ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని చల్లా పిలుపునిచ్చారు.ఈ ఎన్నికలకు నియోజకవర్గ బాధ్యులుగా పరకాల మండల సీనియర్ నాయకులు నేతాని శ్రీనివాస్ రెడ్డి ని నియమిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ, పరకాల, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుగొండ, సంగెం, బల్దియా 15,16,17 డివిజన్ల నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసమే అన్ని రంగాల అభివృద్ధికి మూలం

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్



**వరంగల్, ఆయుధం:** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చని, వ్యక్తిత్వ వికాసమే విద్య, ఉద్యోగం, సామాజిక సేవతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధికి పునాది అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలిపారు. గురువారం పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన నేషనల్ సర్వీస్ స్కీమ్ (NSS) దిశానిర్దేశక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ, NSS ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ, సమాజానికి ఉపయోగపడే NSS వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, NSS ప్రోగ్రామ్ అధికారులు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టళ్లలో మరమ్మతులకు ప్రతిపాదనలు ఇవ్వండి

- మెరుగైన వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




**హనుమకొండ, ఆయుధం:** హాస్టల్స్ లో మెరుగైన వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ప్రత్యేకాధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని సంక్షేమ గురుకుల హాస్టల్స్, వసతి గృహాల ప్రత్యేక అధికారులతో హాస్టల్స్ లో ఉన్న మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనపై సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ హాస్టల్స్ లో ఉన్న వసతులు, అభివృద్ధి పనుల పురోగతి, వాస్తవ పరిస్థితులను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ హాస్టల్స్ లో ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా వసతులు మెరుగ్గా ఉండాలన్నారు. ఎక్కడైనా మరమ్మతులు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రత్యేకాధికారులు అందించాలన్నారు. కోతుల సమస్య ఉన్న హాస్టల్స్ లో గ్రిల్స్ పెట్టించాలని అధికారులకు సూచించారు. హాస్టల్స్ లో విద్యార్థులకు సరిపోను బెడ్లు ఉండాలన్నారు. వసతులు కావాల్సిన హాస్టల్స్ లో వసతులు కల్పిస్తామన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట్లా ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి హాస్టల్ కు మిషన్ భగీరథ ద్వారా నీటి సదుపాయం కల్పించాలన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతినెల ఒకటి నుండి ఐదో తేదీ లోగా స్పెషల్ డ్రైవ్ కింద జిల్లాలో ఉన్న ప్రతి సంక్షేమ హాస్టల్స్ ను తనిఖీ చేయాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్డిఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, హాస్టల్స్ ప్రత్యేక అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## 'సమస్యల పరిష్కారానికే భూ రీసర్వే'

**హనుమకొండ, ఆయుధం:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి గ్రామాలలో భూ రీసర్వే కొనసాగుతుందని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామంలో భూములు కొలతలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే భూ రీసర్వే ప్రక్రియపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ రైతుల సమక్షంలో భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేస్తారని అన్నారు. రీసర్వే ప్రక్రియలో సర్వేయర్లకు సంబంధిత రైతులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎల్లస్వామి, ఆర్డిఓ వెంకటేష్, తహసీల్దార్ విక్రమ్ కుమార్, డీఐ సారంగపాణి, రైతులు, పాల్గొన్నారు.

# కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష

- కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన పలువురు నాయకులు
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



**చిట్యాల, ఆయుధం:** చిట్యాల మండలం, వెంచరామి గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. స్థానిక సర్పంచ్ కాసురమా కుమార్ నాయకత్వంలో, మండల నాయకత్వం, స్థానిక నాయకుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి వారికి పార్టీ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ... కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రైతులు, ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలయ్యాయని, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని పలువురు తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రస్తుతం రైతులకు విద్యుత్ సరఫరా, ఎరువుల లభ్యత తదితర సమస్యలు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో ప్రశ్నలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాటలు చెప్పడం కాదు, ఇచ్చిన హామీలను చేసి చూపించాలి. కేసీఆర్ పాలనలో రైతులు,ప్రజలకు అందిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటనలో చేసిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు పూర్తవుతున్నా గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం కంటే, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలు కోరుకున్న సంక్షేమం, రైతులు కోరుతున్న మద్దతు, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. వెంచరామి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, వారి రాకతో చిట్యాల మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా జక్కే వెంకటేశం, మోరే ధర్మరాజు, కళ్లేపల్లి సదయ్య,చేటుకూరి అశోక్, గుర్రం అయిలయ్య, యూత్ ఉపాధ్యక్షుడు తిప్పన శివ, ఆశాడపు మల్లయ్య, పరికిపండ్ల సమ్మయ్య, పరికిపండ్ల సాగర్, పరికిపండ్ల సంతోష్ పలువురు పార్టీలో చేరారు.



## సౌర విద్యుత్ సాంకేతికతపై
# అవగాహన సదస్సు

**కేయూ క్యాంపస్, ఆయుధం:** కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం వారికి గురువారం విద్యార్థులకు సౌర విద్యుత్ సాంకేతికత, ప్రస్తుత ఆవిష్కరణలు, ఉద్యోగ అవకాశాలు మరియు కెరీర్ మార్గదర్శకత్వంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో సౌర విద్యుత్ సాంకేతిక నిపుణులు డా. బి. శివ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రత్యేక ఉపన్యాసం అందించారు. సౌర విద్యుత్ రంగంలో జరుగుతున్న తాజా సాంకేతిక పరిణామాలు, ఆధునిక సోలార్ పవర్ టెక్నాలజీలు, పునరుత్పాదక ఇంధన రంగంలో భవిష్యత్ అవకాశాలు మరియు ఇంజినీరింగ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ ఉద్యోగ అవకాశాల గురించి ఆయన వివరించారు. అలాగే, విద్యార్థులు తమ ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసుకున్న అనంతరం సౌర విద్యుత్, పునరుత్పాదక ఇంధనం మరియు సంబంధిత పరిశ్రమల్లో కెరీర్‌ను ఎలా అభివృద్ధి చేసుకోవచ్చో ఆయన సూచనలు అందించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్, నిరంతర అభ్యాసం యొక్క ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.బిక్షాలు, ఈఈఈ విభాగం ఇన్‌చార్జి తూర్పాటి వెంకటేష్, అధ్యాపకులు ఎస్.సాహితి, యశస్విని తదితరులు పాల్గొన్నారు. ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులకు పరిశ్రమ నిపుణుల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవకాశాలు, కెరీర్ మార్గదర్శకత్వం అందించడం ద్వారా ఇటువంటి కార్యక్రమాలు వారి భవిష్యత్ కెరీర్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కళాశాల ప్రతినిధులు తెలిపారు.

# స్వచ్ఛంద రక్తదానం ప్రాణదానంతో సమానం

- జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ర్యాలీ, రక్తదాన శిబిరం
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ అప్పయ్య



**హనుమకొండ, ఆయుధం:** జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి (GMH) రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ, స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలోని పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం (UFWC) వద్ద ప్రారంభమైన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. కుమార్‌పల్లి మీదుగా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన ఆవశ్యకతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ... రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందించి వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఇది ఒక గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. 18 సం.ల నుండి 60 సం.ల వయస్సు గల వారు రక్త దానం చేయాలి. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధికారులు స్వచ్ఛంద రక్తదాన ప్రతిజ్ఞ చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల, రక్తనిధి కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిఖిల, పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ అనిల్, మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సీహెచ్ఓ ప్రేమలత, డెమోలు సువార్త, ఎల్లయ్య, రవీందర్, ఎంపీహెచ్ఈఓ విప్లవ్ కుమార్, ల్యాబొరేటరీ టెక్నీషియన్లు శ్రీనివాసరావు, జ్యోతి, పీహెచ్ఎన్ రామేశ్వరి, సూపర్‌వైజర్ బబ్లీ సమ్మా, హెల్త్ అసిస్టెంట్లు రాజేష్, సత్యనారాయణ, శ్రీనివాస్, కమలాకర్, కేసి కుమార్, శరత్, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి యోగాలో
# పతకాలు సాధించాలి

**రాష్ట్ర యోగ సంఘం కార్యదర్శి ఎన్ సిద్ధారెడ్డి**

**వరంగల్, ఆయుధం:** రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ లో జరగనున్న 51వ జాతీయ స్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ యోగా ఛాంపియన్షిప్ లో తెలంగాణ క్రీడాకారులు అధిక సంఖ్యలో పతకాలు సాధించాలని రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. ఈనెల 3వ తేదీ నుండి 6 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే 40 మంది సభ్యులతో కూడిన తెలంగాణ జట్టు గురువారం ఉదయం వరంగల్ రైల్వే స్టేషన్ నుండి జైపూర్ కు పయనమైంది. ఈ సందర్భంగా తెలంగాణ యోగా అసోసియేషన్ తరపున క్రీడాకారులందరికి కోచ్ మేనేజర్లకు మరియు రెఫ్రీలకు తెలంగాణ యోగ అసోసియేషన్ తరపున ట్రాక్ సూట్లను స్పాన్సర్ చేయడం జరిగిందన్నారు. టీం సభ్యులందరికీ వరంగల్ యోగ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొలిశెట్టి కమలాకర్ పి రవీందర్ లు రిఫ్రెష్మెంట్స్ అందజేశారు ఈ సందర్భంగా క్రీడాకారులను తెలంగాణ యోగ అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, అధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి, యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జాల మనోహర్, నిజామాబాద్, కరీంనగర్, హనుమకొండ, పెద్దపల్లి, రంగారెడ్డి జిల్లాల యోగ అసోసియేషన్ కార్యదర్శులు, సభ్యులు సిహెచ్.గంగాధర్, గుంటి రామకృష్ణ, కిషన్ నాయక్, కె.రజిత, పి.కిరణ్, సాయినాథ్, పి.సాగర్, ఆనంద కిషోర్, అభిషేక్, అభినందించారు.




## సైలెన్సర్ల ధ్వంసం

వాహనాలకు కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి అమర్చిన, అధిక శబ్దాన్ని వెలువరించే సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తనిఖీల సందర్భంగా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా స్వాధీనం చేసుకున్న సుమారు 350 మార్పు చేసిన సైలెన్సర్లను రోడ్డు రోలర్ సహాయంతో ధ్వంసం చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర రావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది గురువారం వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సర్కిల్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు మాట్లాడుతూ, వాహనాల సైలెన్సర్లను మార్పు చేసి అధిక శబ్దం వచ్చే విధంగా వినియోగించడం వల్ల శబ్ద కాలుష్యం పెరగడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వాహనదారులు తమ వాహనాల్లో కంపెనీ అమర్చిన ఒరిజినల్ సైలెన్సర్లనే ఉపయోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్చి అధిక శబ్దం వచ్చేలా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ, ఇన్స్పెక్టర్లు సుజాత, ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

– వరంగల్, ఆయుధం



## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పంతిని విద్యార్థులు

వరంగల్, ఆయుధం; జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పంతినికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. 17 సంవత్సరాల విభాగంలో లకావత్ శిరీష, సట్లభవ్యశ్రీ, దూలం లాస్య, దూలం సిరి, బుల్లె వర్ష, మరియు కొలిపాక ఆర్య వీర్, గోర్కంటి అభిరామ్, బంగారి శివ ఎంపిక కాగా 14 సంవత్సరాల విభాగంలో బుల్లె ప్రసన్న, ఉడుతల కస్తూరి, లకావత్ అనూష, మరియు మహమ్మద్ రెహాన్ ఇజ్జగిరి విశ్వతేజ ఎంపికయ్యారు వీరిని గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి ఆనందం వ్యాయామ ఉపాధ్యాయులు కుండె కిరణ్, గుడికందుల సమ్మయ్య, నిర్మల మేడం అట్ల రవీందర్, కోలా రవికుమార్ అభినందించారు.




## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

**హనుమకొండ, ఆయుధం:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. హనుమకొండలో సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో ఈ ఉత్సవాలు ఘనంగా జరిగాయని, 28వ తేదీన జరిగిన భారీ విద్యార్థి ర్యాలీ దేశం మొత్తం విస్తృత చర్చ జరిగిందని ,29,30 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ 90 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం పోరాటాలు, విజయాలు, విద్యారంగ సమస్యలపై చర్చించడం జరిగిందని,30వ తేదీ న రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నూతన ఆఫీస్ బేరర్స్ కమిటీని ఎన్నుకున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి పుట్ట లక్ష్మణ్ తెలిపారు.గురువారం హనుమకొండలోని బాలసముద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠ రెడ్డి(కరీంనగర్), రాష్ట్ర కార్యదర్శిగా పుట్ట లక్ష్మణ్(మేడ్చల్) లు మరోసారి ఎన్నికైనట్లు అదే విధంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఇటిక్యాల రామకృష్ణ(ఖమ్మం), రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రెహమాన్ (నల్గొండ), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బానోత్ రఘురాం నాయక్ (నిజామాబాద్), లెనిన్ (ఉస్మానియా యూనివర్సిటీ), ముదిగొండ మురళి కృష్ణ (నల్గొండ), బలుముల ప్రేమ్ కుమార్(నాగర్ కర్నూల్), రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా భాషబోయిన సంతోష్ (హనుమకొండ), నెల్లి సత్య (హైదరాబాద్), సామిడి వంశీవర్ధన్ రెడ్డి(రంగారెడ్డి), జేరిపోతుల జనార్ధన్(సిద్దిపేట) ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ తెలిపారు.




## సర్ ప్రక్రియ రద్దు చేయాలని..
# సీపీఎం ఆందోళన

- జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలి
- సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్. రంగయ్య

**వరంగల్, ఆయుధం:** సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్ ప్రక్రియ రద్దు చేయాలని కోరుతూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో నిరసన ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు బషీర్ అధ్యక్షతన జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య మాట్లాడుతూ సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, తొలగించిన ఓట్లలో అర్హులైన వారి ఓట్లను తిరిగి చేర్చాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. భారత ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అని అది ఈనాడు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి జేబు సంస్థగా మారిందని అది తీసుకున్న నిర్ణయాల వల్ల భారతదేశ ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుందని, దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరములు నిండిన పౌరులందరికీ ఓటు హక్కు ప్రజాస్వామ్యం చట్టబద్ధంగా రాజ్యాంగబద్ధంగా కల్పించిందని పౌరుల యొక్క రాజ్యాంగం ఇచ్చిన హక్కును ఎన్నికల కమిషన్ కాలరాస్తుందని విమర్శించారు. ఎన్నికల కమిషన్ నిర్ణయాలు ఏకాభిప్రాయంగా ఉండాలని లేదా మెజారిటీ నిర్ణయాన్ని అమలు చేయాల్సి ఉండగా జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు అమలు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. గత పది నెలల కాలంలో 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు తమ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరించడం కేంద్ర బిజెపి ప్రభుత్వానికి ఎన్నికలలో లబ్ధి చేకూర్చుతుందని అన్నారు. దుర్మార్గపు సర్ ప్రక్రియను రద్దు చేయాలని, తొలగించిన ఓట్లలో అర్హులైన వారి ఓట్లు పునరుద్ధరించాలని ప్రధాన ఎన్నికల కమిషనరైన జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని లేనిచో భవిష్యత్తులో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు నలిగంటి రత్నమాల గారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వల దాసు దుర్గయ్య, వివిధ ఏరియాల నుండి నాయకులు ఉసిల్ల కుమార్ తూర్పాటి కవిత, ఇమ్మడి శ్రీను, గున్నాల ప్రభాకర్, అప్పాజీ వాణి, రవీందర్, పులి మాటి శివ, రమ్య, రేణుక, సరిత, శివ, లావణ్య, పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలి

- అక్రమంగా తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట వామపక్షాల భారీ ధర్నా



**హనుమకొండ, ఆయుధం:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే తొలగించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ పై సీఈసీ జ్ఞానేష్ కుమార్ వైఖరిని నిరసిస్తూ, అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు.ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం వామపక్షాలు నిరంతరం పోరాడుతాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని అన్నారు. దొడ్డి దారిన సీఈసీ ని ఉపయోగించుకునే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు వామపక్షాలు దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శిలు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు అశోక్ స్టాలిన్, ఎదునూరి వెంకట్రాజం,కొట్టెపాక రవి, బత్తిని సదానందం, మాలోతు శంకర్, సిపిఎం జిల్లా నాయకులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి,టి.ఉప్పలయ్య, గొడుగు వెంకట్, ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695